## దారిద్ర్యం

మా ఇంటికి అనుకుని ఒక పెంకుటిల్లు వుంది. అది చాలా చిన్న ఇల్లు. దానికి తగినట్టు ఆ ఇంటివాయన ముందు రెండు గదులూ పది రూపాయలకు మరొక కుటుంబానికి అద్దెకు యిచ్చాడు.

అద్దెకున్న ఆయనకు నెలకు ఏభై రూపాయల జీతం. ఎక్కడో, ఏమి ఉద్యోగమో నాకు తెలియదుగాని పొద్దున్నే ఎనిమిది గంటలన్నా అవకముందే భోజనంచేసి వెడుతూ వుంటాడు. మళ్ళీ చీకటిపడ్డాక తిరిగి వొస్తాడు.

వస్తాడంటే అతను రావటం నేనెన్నడూ చూడలేదు. కాని అతను వొచ్చిన మరుక్షణమే నాకు తెలిసేది—అతడు వొచ్చాడని.

ఇంచుమించు అతడు రోజూ ఆఫీసునుంచి తిరిగిరాగానే భార్యను కొడుతూ వుండేవాడు. ఆమె గోలగా ఏడుస్తూ వుండేది. అప్పుడు నాకు తెలిసేది, అతను వొచ్చాడని.

అతనికి ముగ్గురు పిల్లలు-ఇద్దరు మొగపిల్లలు, ఒక ఆడపిల్ల. మొగపిల్లలిద్దరూ చిన్నవాళ్ళు. ఆడపిల్ల పెద్దది. రజస్వలై నాలుగు సంవత్సరాలయింది. ఇంకా వివాహం కాలేదు.

భర్త ఇంటికిరాగానే "దానికి పెళ్ళి చేస్తావా, చెయ్యవా" అని అడిగేది భార్య.

"ఎట్లా చెయ్యమంటావు?" అనేవాడు భర్త.

"ఆ అందరూ చేసినట్టే" అనేది భార్య.

"చేతిలో దమ్మిడీ లేదు" అనేవాడు భర్త.

"దానికి నన్నేం చెయ్యమంటావు" అనేది భార్యా.

"డబ్బు లేదంటూవుంటే" అనేవాడు భర్త.

"పెళ్ళి చెయ్యమంటూ వుంటే" అనేది భార్య.

"అయితే చేస్తానుండు" కర్రతీసుకుని కొట్టేవాడామెను భర్త.

ఆమె గోలగా ఏడ్చేది.

ఈ విషయాలన్నీ నాకు తెలిసినై. అకస్మాత్తుగా పెళ్ళి కాని పిల్ల మీద నాకు జాలి వేసేది.

వాళ్ళు వున్న ఇంటికెదురుగా ఒక మేడ వుంది. ఆ మేడ ఇన్‌కాంటాక్సు ఆఫీసరుది. అతనికి నెలకి వెయ్యి రూపాయిలు జీతం. నలుగురు బంట్రోతులూ, ఒకకారు, ఒకభార్య, ఒక పిల్లవాడు, తనూ అంతా అట్టహాసంగావుండేది. వాళ్ళది చాలా మంచి పొరుగు. వాళ్ళ పనేదో వాళ్ళది తప్ప ఏ జోక్యం పట్టించుకోరు.

ఇన్‌కంటాక్సు ఆఫీసరు సాయంకాలం అయిదు గంటలకు ఆఫీసు నుంచి ఇంటికి వొచ్చేవాడు. ఆయన వొచ్చేటప్పటికి భార్య ముస్తాబై సిద్ధంగా వుండేది. పిల్లవాణ్ని తీసుకుని ఇద్దరూ షికారు వెళ్ళేవారు.

ఆ పిల్లవాణ్ణిచూస్తే నాకు ముచ్చట. ఒకరోజు చిన్నకారు తొక్కుతూ, ఒకరోజు మూడుచక్రాల సైకిలు తొక్కుతూ రోడ్డుమీద అటూ ఇటూ తిరుగుతూ వుండేవాడు. బత్తాయిలూ, దానిమ్మలూ, ఐస్‌ఫ్రూట్లూ, చివరికి పీచుమిఠాయీ—ఎవరినీ ఆ దారిన పోనిచ్చేవాడు కాడు.

ఆ పిల్లవాణ్ణి చూస్తే తల్లిదండ్రులకి అమిత గారాబం. ఎక్కడికి వెళ్ళినా వెంట తీసుకు వెళ్ళేవారు. మంచి మంచి దుస్తులు వేసి పరిశుభ్రంగా వుంచేవారు. అడిగినప్పుడల్లా డబ్బిచ్చేవారు. ఎప్పుడూ తిట్టినట్టుగాని, కొట్టినట్టుగాని నే నెరగను.

ఈ పిల్ల వాడివల్ల వచ్చింది తగాదా.

ఒకరోజు నేను మా ఇంట్లోనుంచి బయటికి వచ్చేటప్పటికి

ఇన్‌కంటాక్సు ఆఫీసరు భార్య వాళ్ళమేడ బాల్కనీలో నించుని వుంది. మా ఇంటి పక్క ఆవిడ తన ముగ్గురు బిడ్డలని పెట్టుకుని తన వాకిట్లో నుంచుని వుంది! ఇద్దరూ పోట్లాడుకుంటున్నారు!

"ఆ మాత్రం బుద్ధి వుండనక్కర లేదుటే?" అని అడిగింది మా ఇంటి పక్కావిడ.

"ఏ మాత్రం?" అడిగింది ఆఫీసరు భార్య.

ఏ మాత్రమో చెప్పింది ఇంటి పక్కావిడ.

"ఇంట్లో దూరి కూర వండుకునే చట్టి ఎట్లా బద్దలుకొట్టాడో చూడు నీ కొడుకు" అన్నది.

"ఏం బాబూ!" అని అడిగింది ఆఫీసరు భార్య కొడుకుని.

"లేదమ్మా, నే నివాళ వాళ్ళ యింటికే వెళ్ళలేను." అన్నాడు కొడుకు.

"వింటున్నావా?" అని అడిగింది ఆఫీసరు భార్య.

"కొడుకును వెనకేసు కొస్తున్నావా?" అని తిట్టింది మా ఇంటి పక్కావిడ "ఇప్పుడు చట్టిని మళ్ళీ కొనాలి అంటే అణా పెట్టాలి."

"అణా తీసుకు వూరుకో" అన్నది ఆఫీసరు భార్య.

"నీ కెంత పొగరే?" అన్నది మా ఇంటి పక్కావిడ.

"మొగుడు సంపాదిస్తున్నాడని మదం" అన్నది పెళ్ళికాని పిల్ల. ఈ పిల్లని చూస్తేనేనట నాకు జాలి!

"ఉంటే తింటుంది, ఎవరికేం?" అన్నది మా ఇంటి పక్కావిడ.

ఈ విధంగా తల్లీ, కూతురూ తిట్టుమీద తిట్టు ప్రారంభించారు. ఆఫీసరు భార్య వాళ్ళ తిట్లు భరించలేక బిక్కమొహం పెట్టుకుంది. "అయితే ఇప్పుడేం చెయ్యమంటారు?" అని అడిగింది.

"నీ కొడుక్కి బుద్ధి చెప్పుకో" అన్నది మా ఇంటి పక్కావిడ.

"నన్ను కారు ఎక్కించమంటే ఎక్కించలేదే!" అన్నాడు మా ఇంటి పక్కావిడ పిల్లవాడు.

"వాణ్ణి తన్ని మా వాకిట్లోకి రాకుండా చేస్తావా లేదా?" అని అడిగింది మా ఇంటి పక్కావిడ!

"తన్నటం నా వల్లకాదు" అన్నది ఆఫీసరు భార్య.

"మరి ఏం చేస్తానంటావ్?" అన్నది మా ఇంటి పక్కావిడ.

"మీ ఇంటికి రాకుండా చేస్తాను" అని పిల్లవాణ్ణి తీసుకుని గిరుక్కున లోపలికి వెళ్ళింది ఆఫీసరు భార్య.

"మా వాకిటి ముందుకి వచ్చాడంటే మక్కెలు విరగ కొడతాను, మా పిల్లవాళ్ళతో మాట్లాడితే డొక్క చీలుస్తాను" అన్నది మా ఇంటి పక్కావిడ.

"బజారులో వున్న పిల్లలందర్నీ చెడగొడుతున్నాడే?" అన్నది పెళ్ళికాని పిల్ల!

"ఇందాక పీచుమిఠాయి పెట్టమంటే పెట్టలేదే" అన్నాడు పిల్లవాడు!

"మహాతల్లి పెట్టనిస్తుందా?" అన్నది మా ఇంటి పక్కావిడ!

"మొగుడు సంపాదిస్తున్నాడని మదం" అన్నది పెళ్ళికాని పిల్ల!

ఈ పిల్లను చూస్తేనేనట నాకు జాలి!

ఈ పోట్లాట వింటూవుంటే నాకు ఆశ్చర్యం వేసింది! మా ఇంటి పక్కావిడ గిల్లి కజ్జా పెట్టుకోవాలని ప్రయత్నిస్తూవుందని నాకు అనుమానం. కాని ఎంత ఆలోచించినా, కారణం మాత్రం బోధపడలేదు.

కొంచెం సేపయింతరువాత ఏమీ తోచక బజారుకి బయలుదేరాను! ఆఫీసరుగారి యిల్లు లోపల గడియవేసివుంది మా ఇంటి పక్కావిడ మాత్రం తన ముగ్గురు పిల్లలతోటీ వాకిట్లోనే వుంది! వాడకట్టు అమ్మలక్కలంతా ఆమె చుట్టూ పోగయ్యారు!

"బాగా రోగం కుదిర్చావే" అంటున్న దొకావిడ!

"లేకపోతే, హద్దూ పద్దూ వుండక్కర్లా? జేబులో డబ్బులు వేసుకు రావటం, కనపడ్డవల్లా కొనటం! వాణ్ణిచూచి ఎన్నడూ లేని మా పిల్లలు కూడా నేర్చుకున్నారు; ఊపిరాడనిస్తున్నారా?" అన్నది మా ఇంటి పక్కావిడ.

"వాడ తొడుక్కున్న సిల్కు చొక్కా లాంటిది కుట్టించమని నాలుగు రోజులనుంచి వేధిస్తున్నాడు మా వాడు" అన్నది ఇంకొకావిడ!

"సరే, అలాంటి కారు కోసం మావాడు ఒకటేగోల" అన్నది మరోకావిడ!

"డబ్బున్నదని పిల్లల కట్లా ఇచ్చుకుంటారటే యెక్కడైనా? వేలదున్నాడో లేడో గాని వాడికప్పుడే ఎన్ని షోకులు చూశావా? ఇట్లా అయితే మనమెక్కడ కాపరాలు చెయ్యగలం?" అన్నది మా ఇంటి పక్కావిడ!

"నువ్వివాళ బాగా ఒడ్డించావులే" అన్నది ఒకావిడ!

"అప్పుడే అయిందీ వాళ్ళనీ వీధిలో లేకుండా చేస్తేనేగాని నాకు నిద్రపట్టదు" అన్నది మా ఇంటి పక్కావిడ!

"అంతే, అంతే" అన్నారు అమ్మలక్కలంతా!

"లేకపోతే, తన కొడుకు సంగతేగాని మిగతా వాళ్ళసంగతి ఆలోచించక్కర్లా?" అన్నది మా ఇంటి పక్కావిడ!

"మొగుడు సంపాదిస్తున్నాడని మదం" అన్నది పెళ్ళికాని పిల్ల!

ఈ పిల్లని చూస్తేనేనట నాకు జాలి?

రాత్రి అయింది. మా ఇంటి పక్కావిడ భర్త ఇంటికి వొచ్చాడు. ఒచ్చీరావటంతోటే "దానికి పెళ్ళి చేస్తావా, చెయ్యవా?" అని అడిగింది భార్య.

"ఎట్లా చెయ్యమంటావ్?" అన్నాడు భర్త.

"అందరూ జేసినట్టే" అన్నది భార్య.

"చేతిలో దమ్మిడీలేదు_అన్నాడు భర్త!

"దానికి నన్నేం చెయ్యమంటావ్?" అన్నది భార్య.

"డబ్బు లేదంటూవుంటే" అన్నాడు భర్త.

"పెళ్ళి చెయ్యమంటూవుంటే" అన్నది భార్య.

"అయితే చేస్తానుండు" అని కర్ర తీసుకుని కొట్టాడామెను భర్త. ఆమె గోలగా యేడ్చింది.